దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా వివిధ రంగాల్లో 30 ఏళ్లుగా సేవలందిస్తున్న క్రైస్తవులు, సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి హన్మంత్‌రావు తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో ఎంపికైన వారికి అవార్డులు, సన్మానాలు చేయనున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను వచ్చేనెల 5లోగా జిల్లా మైనార్టీసంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

జిల్లాలో నేడు

ఐటీఐలో జాబ్ మేళా

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నేడు అల్వాల్ ఐటీఐలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం. రాధిక తెలియజేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అపోలో ఫార్మసీ ఇంటర్వ్యూలు నిర్వహించనుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని, ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9866465024, 7386809422 నంబర్లలో సంప్రదించవచ్చునని ఆమె తెలిపారు.

అయ్యప్ప పల్లకీ సేవ

తాండూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తాండూరు శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు చేశారు. అయ్యప్పనగర్‌లో వెలిసిన ఈ ఆలయంలో బుధవారం పల్లకీసేవ, అయ్యప్ప స్వామి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మనోజ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బాకారం జైపాల్‌రెడ్డి తెలిపారు. అయ్యప్ప స్వాములు స్వామివారి ఊరేగింపులో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం ● చేయాలన్నారు.

నియామకం

అదనపు ఎస్పీగా హనుమంతరావు

వికారాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ టీవీ హనుమంతరావు జిల్లా అదనపు ఎస్పీగా నియమితులయ్యారు. ఈ బదిలీ పోలీస్‌శాఖలో సాధారణ బదిలీల్లో భాగమని అధికారులు పేర్కొన్నారు.



సొండేపూర్‌లోని కేంద్రంలో అన్‌లోడ్ చేస్తున్న పత్తి

పత్తి రైతు పరేషాన్!

సీసీఐ కేంద్రాల్లో నాణ్యత పేరిట కొర్రీలు

సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలతో పత్తి రైతులు దగాకు గురవుతున్నారు. పత్తి అమ్ముకోడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఈసారి కురిసిన అధిక వర్షాలతో పంటలు దెబ్బతిని దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. చేతికొచ్చిన పంటను విక్రయించేందుకు సీసీఐ సెంటర్లకు తీసుకెళ్తే నిర్వాహకులు తేమ పేరుతో కొర్రీలు పెడుతున్నారు. దీంతో గత్యంతరం లేక దళారులకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టుబడి కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పత్తి నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

- దళారుల రంగప్రవేశం
- సిండికేట్‌గా మారిన సీసీఐ నిర్వాహకులు, వ్యాపారులు
- తక్కువ ధరకు కొనుగోళ్లు
- తూకాల్లో భారీ మోసాలు
- నిలువునా నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

పరిగి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, కోట్‌పల్లి, మర్పల్లి, ధారూర్, కోట్‌పల్లి ప్రాంతాల్లో మొత్తం 14 కాటన్ మిల్లులు ఉన్నాయి. అందులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ పత్తి క్వింటాలుకు రూ.7,521, బి గ్రేడ్‌కు రూ.7,220 ధర నిర్ణయించింది. అయితే ప్రభుత్వ కేంద్రాలకు రైతులు పత్తిని తీసుకుపోగా నిబంధనల పేరిట కొర్రీలు పెడుతుండడంతో గత్యంతరం

మిగతా 8వ పేజీలో...

గజగజ

పంజా విప్పిన చలిపులి



పడిపోతున్న ఉష్ణోగ్రతలు

మోమిన్‌పేటలో 9.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

వికారాబాద్/మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాను చలి వణికిస్తోంది. ఒక్కసారిగా పగటి ఉష్ణోగ్రతలు సైతం గణనీయంగా పడిపోతున్నాయి. ఇళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. గ్రామాల్లో సాయంత్రం 5.30 గంటల నుంచి చల్లగాలులు వీస్తున్నాయి. దీంతో చలి నుంచి ఉపశమనం పొందేందుకు చలి మంట వేసుకుంటున్నారు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో మంగళవారం అత్యల్పంగా 9.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లాలో 10.4 డిగ్రీలు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లిలో 12.2 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ధర్నా చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

భూములు లాక్కోవడం సరికాదు

కొడంగల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఫార్మాకు రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకోవడం సరైంది కాదని ఎల్‌హెచ్‌పీఎస్ గిరిజన సంఘం జాతీయ అధ్యక్షుడు దాసరామ్‌నాయక్ అన్నారు. లగచర్ల ఘటనపై మంగళవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో చలో కొడంగల్ కార్యక్రమాన్ని చేపట్టారు. కొడంగల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ అభిప్రాయ సేకరణలో లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంట తండా, మైసమ్మ తండా, ఈదుకుంట తండా, దుద్యాల, పోలెపల్లి, హకీంపేట్ రైతులకు అండగా ఉంటామన్నారు. అధికారులపై జరిగిన దాడిలో గిరిజనులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. భూములు ఇవ్వం అని రైతులు చెబుతున్నా ప్రభుత్వం బలవంతంగా తీసుకునేందుకు యత్నించడం తగదన్నారు. గిరిజనులపై కేసులను ఎత్తేసి జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా విషయం తెలిసి పోలీసులు ముందస్తుగా పలువురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



2కె రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది

» కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని, 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఓటరుఅవగాహన కార్యక్రమంలో భాగంగా ఎన్నెపల్లి చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఓటుహక్కు ఆయుధం లాంటిదన్నారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కాగా స్వీప్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో మెప్మా, గురుకుల పాఠశాల విద్యార్థులు, సెర్ప్ మహిళా సంఘాల సభ్యులచే రంగోళి కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించి అభినందించారు. అలాగే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఢిల్లీ నుంచి కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ.ప్రతిరోజు ధాన్యం కొనుగోలు నివేదికలు అందజేయాలన్నారు. ఈనెల 30న రైతుల పండుగను విజయవంతం చేయాలని ఆదేశించారు.

రాజ్యాంగం పవిత్రమైనది

మేడ్చల్ ప్రతినిధి : భారత రాజ్యాంగం ఎంతో పవిత్రమైనదని, అందులోని నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత, ప్రజా జీవితాల్లో రాజ్యాంగంలోని అంశాలను విధిగా పాటించాలన్నారు. అనంతరం రాజ్యాంగాన్ని గౌరవిస్తామని అధికారులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.

ప్రజాప్రయోజనాల కోసం చట్టాలు

భారత రాజ్యాంగం ద్వారా దేశంలోని ప్రజలందరికీ ప్రాథమిక హక్కులను కల్పించడంతో పాటు ప్రజల ప్రయోజనాలు లక్ష్యంగా చట్టాలను సైతం పొందుపర్చారని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. పోలీస్ కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో, ఏవో జ్యోతిర్మనీ, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, ఆర్ఐ అంజాత్ పాషా, డేవిడ్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న మేడ్చల్ అదనపు కలెక్టర్

కానరాని కల్లాలు

జిల్లాలో నిర్మాణానికి నోచని వైనం

రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

జిల్లాలో మొత్తం 585 కల్లాలకు అనుమతి

నిర్మాణం పూర్తయినవి 227మాత్రమే



కొడంగల్ శివారులో రోడ్డు మీదనే ఆరబోసిన వడ్లు

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలో వడ్లు ఆరబోసేందుకు కల్లాలు కరువయ్యాయి. ఏగ్రామ పరిధిలో చూసినా రోడ్లన్నీ ధాన్యంతోనే నిండిపోయాయి. స్థలాలు లేకపోవడం, పొలాల్లో పోసే పరిస్థితి లేక రైతులు రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. జిల్లాలోని వరిసాగు ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయడంతో ధాన్యం దిగుబడి కూడా ఎక్కువగానే ఉంది. దీంతో కల్లాలు లేకపోవడంతో రోడ్లపై ధాన్యాన్ని ఆరబోస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కాగా కల్లాల నిర్మాణానికి రైతులు ముందుకురావడం లేదు. 5ఎకరాల లోపు ఉన్న రైతులు కల్లాలు నిర్మించుకునేందుకు గత ప్రభుత్వ హయాంలో అనుమతులిచ్చింది. 75, 60, 50 స్క్వేర్‌మీటర్స్‌లలో నిర్మించే కల్లాలకు రూ.75, 65, 50వేల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే రైతులు ముందుగా డబ్బులు వెచ్చించి కల్లాలు నిర్మించాల్సి వస్తుంది. ఆ తర్వాత ప్రభుత్వం బిల్లు చెల్లిస్తుంది. దీంతో రైతులు కల్లాలు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. దీనికితోడు 5 ఎకరాల్లోపు ఉన్న రైతులు కల్లం నిర్మాణం కోసం స్థలం కేటాయించాల్సి వస్తున్నది. లక్ష్యం పూర్తి చేసేందుకు అధికారులు కొన్ని చోట్ల కాంట్రాక్టర్లతో

మిగతా 8వ పేజీలో...



రామలింగేశ్వరుడికి రుద్రాభిషేకం

కీసర, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): కీసరుగుట్టలోని రామలింగేశ్వరస్వామికి శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా జరిగింది. కార్తీక మాసోత్సవం సందర్భంగా మంగళవారం గర్భాలయంలోని మూలవిరాట్‌కు ఉదయం నిత్యసేవల్లో భాగంగా పంచామృతాలతో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ మహామండపంలో లక్ష్మీ పద్మావతి బృందం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



ఆందోళన చేస్తున్న వామపక్షాల నాయకులు

రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

వికారాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం దేశంలోని వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు రైతు వ్యతిరేక నల్లచట్టాలను, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, వామపక్షాల నాయకులు మహిపాల్, కృష్ణయ్య, గీత, గోపాల్‌రెడ్డి, మహేందర్, రామకృష్ణ, పీర్ మహమ్మద్, శ్రీనివాస్, మంగమ్మలు పేర్కొన్నారు. కేంద్రం తీసుకొచ్చిన రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఈ చట్టాలను రద్దు చేసే వరకు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఽప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తూ వారి హక్కులపైన ఆంక్షలు విధిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, మల్లేశ్, శ్రీకాంత్, రాములు, సుదర్శన్, సురేష్, అనంతయ్య, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన ఏఈ బల్‌రామ్ నాయక్, హేమంత్, మహేష్

ఏసీబీ వలలో విద్యుత్ అధికారులు

రూ. 15వేలు లంచం డిమాండ్ చేసిన ఏఈ, లైన్‌ఇన్‌స్పెక్టర్

ఘట్‌కేసర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):లంచం తీసుకుంటూ విద్యుత్ ఏఈ లైన్‌ఇన్‌స్పెక్టర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మంగళవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. జిల్లా ఘట్‌కేసర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ వైర్‌ను పాత స్తంభం నుంచి కొత్త స్తంభానికి కనెక్షన్ మార్చడంతోపాటు సైడ్‌ఆరమ్‌ను ఏర్పాటు, ఎల్‌సీ కోసం కాంట్రాక్టర్‌ను ఏఈ బాల్‌రామ్‌నాయక్ రూ.10వేలు, లైన్‌ఇన్‌స్పెక్టర్ రూ.5వేలు డిమాండ్ చేశారు. వారం రోజుల్లో ఇవ్వాల్సిన ఎస్టిమేషన్‌కు నెలరోజులకు పైగా కాలయాపన చేశారు. లైన్ ఇన్‌స్పెక్టర్ తప్పుడు ఎస్టిమేషన్లు ఇచ్చి ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో కాంట్రాక్టర్ అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. దీంతో మంగళవారం మధ్యాహ్నం రూ.15వేలను ఏఈ బల్‌రామ్ నాయక్‌కు ఇచ్చేందుకు కాంట్రాక్టర్ వెళ్లగా ఆయన లైన్‌ఇన్‌స్పెక్టర్‌ను కలవమని సూచించాడు. ఆయన వద్దకు వెళ్లగా పక్కనే ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మహేష్‌కు డబ్బులు ఇచ్చి వెళ్లమని చెప్పాడు. మహేష్ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. లంచం తీసుకుంటు పట్టుబడిన ఏఈతోపాటు, లైన్‌ఇన్‌స్పెక్టర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని అరెస్టు చేసి జడ్జిముందు హాజరు పరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

క్రైస్తవ మైనార్టీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 2024 క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని ప్రభుత్వం మత పెద్దలు, సంస్థలను సత్కరించనుందని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి మంగళవారం కె.వీణ తెలిపారు. జిల్లాలో 30ఏళ్లుగా సామాజిక సేవలందిస్తున్న వ్యక్తులు, సంస్థలు, పదేళ్లుగా సేవలందిస్తున్న క్రైస్తవ మిషనరీలు నామినేషన్లు డిసెంబరు 5లోగా తమ కార్యాలయంలో.. రూం నంబర్ ఎస్-2, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్, అంతాయపల్లి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అడ్రెస్‌కు పంపాలన్నారు. దరఖాస్తు ఫామ్ వెబ్‌సైట్‌లో లేదా తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ అల్పసంఖ్యాక వర్గాల ఆర్థిక సహాయ సంస్థ, గృహకల్ప భవన్, 2వ అంతస్తు, ఎంజే రోడ్, నాంపల్లి, హైదరాబాద్‌లో పొందొచ్చని వివరించారు. మరిన్ని వివరాలకు 040-23391067 నంబరులో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యులు

తాండూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రెసిడెన్షియల్ స్కూల్‌లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తాండూరు జిల్లా ఆసుపత్రి వైద్యురాలు రుబియానాజ్ అన్నారు. మంగళవారం ఐనెల్లిలోని మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించారు. ప్రిన్సిపాల్ వినోద్‌ఖన్నాతో మాట్లాడుతూ విద్యార్థులకు ఏమైనా ఆరోగ్య సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు 430మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు చర్మవ్యాధులు, పరిసరాల పరిశుభ్రత వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జినుగుర్తి పీహెచ్‌సీ వైద్యులు రాధ, కృష్ణవేణి, కరుణ, టీచర్లు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ విధానంతో ఉద్యోగాలు



నారాయణరెడ్డి, ఎస్పీ

వికారాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా భరోసా సెంటర్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేసేందుకు మూడు ఉద్యోగాలు ఉన్నాయని ఎస్పీ నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. మహిళా అభ్యర్థులు జిల్లా పోలీస్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెంటర్ కోఆర్డినేటర్ ఒక పోస్టు, సపోర్ట్ పర్సన్ రెండు పోస్టులున్నాయని తెలిపారు. ఉద్యోగాల కాల వ్యవధి ఏడాదని పేర్కొన్నారు. అవసరం మేరకు పొడిగించే అవకాశం ఉంటుందన్నారు. బయోడేటా, సర్టిఫికెట్ కాపీలను జిల్లా పోలీసు కార్యాలయానికి ఈ-మెయిల్ చేయొచ్చని లేదా 8712670063 నంబర్‌కు వాట్సాప్ చేయొచ్చని తెలిపారు. కోఆర్డినేటర్‌కు ఎంఏ ఎంఎస్‌సీ, సైకాలజీ విద్యార్హత, రెండేళ్ల సర్వీసు అనుభవం ఉండాలన్నారు. జీతం రూ.30వేలు ఉంటుందన్నారు. సపోర్ట్ పర్సన్ పోస్టుకు మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్(ఎంఎస్‌డబ్ల్యూ), ఏడాది సర్వీసు అనుభవం ఉండాలన్నారు. జీతం రూ.20వేలు ఇస్తారని ఎస్పీ వివరించారు.

బాల్య వివాహాలతో మహిళల ఆరోగ్యానికి ముప్పు



మాట్లాడుతున్న న్యాయాధికారి శీతల్

వికారాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో మహిళల ఆరోగ్యం క్షీణిస్తుందని, అలాగే వారికి పుట్టిన పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉండలేరని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి డీ.శీతల్ అన్నారు. మంగళవారం బూర్గుపల్లిలోని గురుకుల పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అధికారి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ పెళ్లివయసు వచ్చిన తరువాతే వివాహం చేసుకోవాలని సూచించారు. కాలేజీల్లో ర్యాగింగ్ కొన్ని సందర్భాల్లో ప్రాణాంతకంగా మారుతోందని, ఇలాంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ న్యాయవాదులు వెంకటేశ్, రాము, శ్రీనివాస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడపొద్దు

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీనాయక్



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీనాయక్

చేవెళ్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నంబర్‌ప్లేట్ లేకుండా రోడ్లపై వాహనాలు నడిపిస్తే కేసులు నమోదు చేస్తామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ నాయక్ తెలిపారు. మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో నంబర్ ప్లేట్‌లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నంబర్‌ప్లేట్స్ లేకుండా రోడ్లపై ఇష్టారాజ్యంగా వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈమేరకు 17 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. సీఐ ఎస్.వెంకటేశం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రానివి రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు



నిరసన ర్యాలీలో కార్మికులు, సీఐటీయూ నాయకులు

ఆమనగల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని రైతు సంఘం జిల్లా నాయకుడు కానుగుల వెంకటయ్య, సీఐటీయూ ఏరియా కన్వీనర్ జిల్లెల్ల పెంటయ్య, కేయూపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ చెన్నయ్య, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్‌లు ఆరోపించారు. జాతీయ ఉపాధిహామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించి నిర్వీర్యం చేయడానికి కేంద్రం కుట్ర చేస్తుందన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం రైతు, కార్మిక సమస్యలను పరిష్కరించాలని, కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఆయా సంఘాల ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్‌వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై బైటాయించి నిరసన, ధర్నా చేపట్టారు. మున్సిపల్ కార్మికులతో కలిసి నాయకులు ర్యాలీ చేపట్టారు. ప్రజా సంఘాల నాయకులు కురుమయ్య, పోచయ్య, శంకర్, పవన్, సీఐటీయూ మండల నాయకులు సురేందర్, జహంగీర్, హంసమ్మ, రాములు, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సంస్థకు కార్మికులే పట్టుగొమ్మలు



పురస్కారం అందుకున్న ఆర్టీసీ కార్మికులు

మేడ్చల్ టౌన్, నవంబరు(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ కార్పోరేషన్ అభివృద్ధికి కార్మికులే పట్టుకొమ్మలని, సంస్థ నడిచేలా కృషిచేయాల్సిన బాధ్యత ప్రతీ కార్మికుడిపై ఉందని మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్ అన్నారు. ప్రగతి చక్రాల పురస్కారంలో భాగంగా మంగళవారం డిపోలో డ్రైవర్, కండక్టర్లను సన్మానించారు. అక్టోబరులో ఇంధనం ఆదా చేసిన డ్రైవర్లకు, ఇన్సెటివ్ పొందిన కండక్టర్లకు బహుతి అందజేశారు. కార్మికులు కష్టపడి పనిచేసి సంస్థకు మరింత గుర్తింపు తేవాని డీఎం కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాల పనుల బిల్లుల్లో కోత!

- పనులకు వెచ్చించింది రూ.2.50లక్షలు
- ఎంబీ రికార్డులేమో రూ.1.37లక్షలకే
- న్యాయం చేయాలంటున్న మహిళ



పాఠశాలలో నిర్మించిన సెప్టిక్ ట్యాంక్ గుంతలు



ట్యాంకు నుంచి వేస్తున్న పైప్‌లైన్(ఫైల్)

ధారూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాల స్కీం కింద పనులు చేసిన ఓ మహిళకు సరిగ్గా బిల్లు రికార్డు చేయక ఇబ్బందులు పడుతున్నారు. రూ.2.50లక్షలతో పాఠశాలలో పనులు చేయిస్తే రూ.1.37లక్షలకే ఇంజినీరింగ్ అధికారులు ఎంబీ రికార్డు చేశారని సదరు మహిళ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. స్టేషన్ ధారూరు ప్రాథమికోన్నత పాఠశాలలో పనులకు రూ.4.4లక్షలు కేటాయించారు. పనులను వాణిశ్రీ(మార్కెట్ కమిటీ డైరెక్టర్) చేశారు. గ్రామంలోని నీటి ట్యాంకు నుంచి స్కూల్ ట్యాంకులకు 350ఫీట్ల పైప్‌లైన్ వేయించారు. ఆరు గదుల్లో కరెంటు పనులు, మరుగుదొడ్లలో రెండు సెప్టిక్ ట్యాంక్‌లకు గుంతలు, కొత్తగా కుండీలు, టైల్స్, వాటర్ పైప్ లైన్, నల్లాల బిగింపు, కిటికీలు ఏర్పాటు, కిచెన్ షెడ్‌లో ఫ్లోరింగ్, గ్యాస్ పైప్‌లైన్ తదితర పనులకు రూ.2.5లక్షలు ఖర్చు చేశారు. అయితే ఇంజినీరింగ్ అధికారులు రూ.1.37లక్షలకే ఎంబీ రికార్డు చేశారు. ఇప్పటి వరకు 1.21లక్షలు మాత్రమే డ్రాచేయగా మిగతా డబ్బుకోసం, వాస్తవ బిల్లు రికార్డు కోసం ఆమె అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

పనులు చేసినా ఎంబీ రికార్డు చేయలేదు



పాఠశాలలో గుర్తించిన పనులన్నీ నాణ్యతగా చేయించాను. పనులకు రూ.2.50లక్షలు ఖర్చు చేశాను. అధికారులు ఎంబీ రికార్డుల్లో రూ.1.37లక్షలకే చేయడంతో పెట్టుబడి రాని పరిస్థితి నెలకొంది. జూన్‌లో వెంటపడి పనుల చేయించిన అధికారులు బిల్లు మాత్రం న్యాయంగా చేయలేదు. లేదంటే అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసి నాకు జరిగిన అన్యాయంపై వివరిస్తా. - **వాణిశ్రీ, పాఠశాల పనులు చేసిన మహిళ**

పట్టుబడిన వాహనాల వేలం నేడు

శంషాబాద్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్-శంషాబాద్ పరిధిలో గతంలో డ్రగ్స్ (గంజాయి) అక్రమ రవాణాలో వినియోగించి పట్టుబడిన వాహనాలను నేడు(బుధవారం) వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్‌రావు ప్రకటనలో పేర్కొన్నారు. పట్టుబడిన ద్విచక్ర వాహనం, త్రిచక్ర వాహనం(ఆటో)నకు బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

కడ్తాల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని ఆమనగల్లు ఏడీఏ ఆదిలక్ష్మి అన్నారు. మండలంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఏవో శ్రీలతతో కలిసి సందర్శించారు. 17లోపు తేమ శాతం ఉండేట్లు ఆరబెట్టుకోవాలని సూచించారు. ఏఈవోలు రమేశ్, అభినవ్, అనూష, వందన ఉన్నారు.

ఆలయాల వద్ద నిఘా పెంచాలి

షాద్‌నగర్‌రూరల్/ఆమనగల్లు/తలకొండపల్లి/కేశంపేట,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆలయాల వద్ద నిఘాను పటిష్ఠం చేసుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి తెలిపారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం షాద్‌నగర్ పట్టణంతో పాటు ఫరూఖ్‌నగర్ మండలంలోని ప్రార్థనా మందిరాలు, మసీదులు, చర్చీల పూజారులు, ఇమాంలు, పాస్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. షాద్‌నగర్ పరిధిలో 113 మందిరాలు ఉన్నాయని, ప్రతీ ప్రార్థనా మందిరానికి తాళంవేసేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డోర్లు పటిష్ఠంగా ఉండటంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు తదితరులున్నారు. అలాగే ఇటీవల ఆలయాలపై జరుగుతున్న దాడులను దృష్టిలో ఉంచుకొని ప్రతీ దేవాలయం దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ కోరారు. ఆమనగల్లు స్టేషన్ ఆవరణలో వివిధ మతాలు, వర్గాలకు చెందిననాయకులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై బి.వెంకటేష్, నాయకులు తదితరులున్నారు. నేర నియంత్రణ, పరిశోధనకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. తలకొండపల్లి మండలంలో భద్రత చర్యల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి రూ.50 వేలు, గట్టిప్పలపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రేణురెడ్డి రూ.10 వేలు, కర్కస్ తండాకు చెందిన శంకర్ రూ.5వేలు, రాజేందర్ నాయక్ రూ.2వేలు సమకూర్చారు. స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌కు అందజేశారు. అన్ని గ్రామాలు, తండాలు , వ్యాపార సముదాయాలు, దేవాలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సూచించారు. మోహన్‌రెడ్డి, రవీందర్ యాదవ్, అజీం, కృష్ణ, చెన్నకేశవులు, ఆరిఫ్, రఘురాములు, తదితరులు పాల్గొన్నారు. అలాగే హిందూ, ముస్లిం, క్రిష్టియన్ ఆధ్యాత్మిక కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కేశంపేట ఇన్‌స్పెక్టర్ నరహరి సూచించారు. స్టేషన్‌లో వివిధ మతాలకు చెందిన ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్సై రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నరహరి

ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి



సబితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహేశ్వరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో దర్గాలు, మసీదుల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం మండల కేంద్రంలో ముస్లిం కమ్యూనిటీ హాలు, దర్గా అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని మంగళవారం మహేశ్వరం ముస్లిం కమ్యూనిటీ నాయకులు సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల కమ్యూనిటి హాళ్ల, దర్గాల అభివృద్ధికి త్వరలో నిధులు విడుదల చేయిస్తానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు ఎంఏ సమీర్, హాజీ బాబా తదితరులున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

రంగాపూర్, చీదేడ్‌లలో అభివృద్ధి పనులు ప్రారంభం



చీదేడ్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల మండలం రంగాపూర్, చీదేడ్ గ్రామాల్లో రూ.36లక్షల నిధులతో చేపట్టిన సీసీరోడ్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, బి.రమాకాంత్‌రెడ్డి, వెదిరె హన్మంత్‌రెడ్డి, చీమల జంగయ్య యాదవ్, జెనిగె వెంకటేష్‌యాదవ్, జిలమోని సత్తయ్య, జంగయ్యగౌడ్, తదితరులున్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకోవాలి

యాచారం : అధికారులు ప్రతీ సోమవారం ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అయ్యవారిగూడలో రూ.16లక్షలు, చౌదర్‌పల్లిలో రూ.18లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లను ప్రారంభించారు. రుణమాఫీ కాలేదని రైతులు తెలపడంతో అధికారుల తీరుపై మండిపడ్డారు. మీ అడ్మినిస్ట్రేషన్ బాగా లేదని, మీరేం చేస్తున్నారని ఎంపీడీవోను ప్రశ్నించారు. కార్యదర్శిని గ్రామంలోనే ఉండాలని, హైదరాబాద్‌లో ఉంటే ఏం లాభమని ప్రశ్నించారు. మిషన్ భగీరథ అధికారుల తీరుపైనా మండిపడ్డారు. బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీవో శ్రీలత, పంచాయతీ రాజ్ ఏఈ వంశీ, ఏపీవో లింగయ్య, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్‌రెడ్డి, సెర్ప్ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను అర్హులకు వర్తింపజేయాలి



బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు వర్తింపజేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని మండలి చీఫ్‌విప్ మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ మార్కెట్ కమిటీ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం కండ్లకోయలో నిర్వహించిన మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రైతుల రుణమాఫీ చేసిందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ ఏఎంసీ చైర్మన్‌గా నర్సింహులు, డైరెక్టర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బొంగునూరు శ్రీనివాస్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు వస్తారని ప్రచారం జరిగినా వారు రాలేదు. మేడ్చల్, గుండ్లపోచంపల్లిల్లో మంత్రులకు స్వాగతం పలుకుతూ కటౌట్‌లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. చివరికి మంత్రులు రాకపోవటంతో నాయకులు నిరాశ చెందారు. ఒక వర్గానికే చెందిన నాయకులు, కార్యకర్తలు అధికారిక కార్యక్రమాల్లో పెత్తనం చలాయిస్తున్నారని కొందరు కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమానికి రాలేదు. డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డిలు కార్యక్రమానికి రాకపోవడం చర్చనీయాంశమైంది. మార్కెట్ కమిటీలో పదవులు దక్కలేదని కొందరు సీనియర్లు కినుక వహించారు. అదేవిధంగా కటౌట్లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ ఫొటో లేదని ఆయన అభిమానులు ఫ్లెక్సీని చింపేశారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ



శంషాబాద్ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తెలిపారు. మదన్‌పల్లి పాత తండాలో సీసీ రోడ్డు పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. మదన్‌పల్లి పాత తండాకు ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.10లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. మాజీ జడ్పీటీసీ తన్వీరాజు, వైస్ఎంపీపీ నీలం మోహన్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ కోసం పడిగాపులు

బషీరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కొత్లాపూర్‌లో ఆసరా పింఛన్ల కోసం వృద్ధులు, వితంతువులు మంగళవారం పడిగాపులు కాశారు. పంచాయతీ వద్ద సాయంత్రం వరకు నిరీక్షించినా బీపీఎం రాక ఉస్సూరుమంటూ ఇళ్లకు వెళ్లిపోయారు. నెల నెలా పింఛన్ల కోసం ఇదేతంతు నడుస్తోందని వృద్ధులన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి విశాల్ స్పందిస్తూ నెలనెలా కొత్త బీపీఎంలు వస్తుండటంతో ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు.

దేవుని ఎర్రవల్లిని మున్సిపాలిటీలో కలపొద్దు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చేవెళ్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటు కాబోతున్న చేవెళ్ల మున్సిపాలిటీలో దేవుని ఎర్రవల్లి గ్రామాన్ని విలీనం చేయొద్దని ఆ గ్రామస్తులు, పలువురు నాయకులు కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. మంగళవారం గ్రామానికి చెందిన నాయకులు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, గ్రామస్తులు కలెక్టరేట్‌లో నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. గత అక్టోబరు 2న గ్రామస్తులందరూ తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపొద్దని తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. నాయకులు బక్కయ్య చంద్రయ్య రాజిరెడ్డి, మల్‌రెడ్డి, సత్యనారాయణ, రవీందర్, తదితరులున్నారు.

సీజ్ చేసిన వాహనాల వేలం

మేడ్చల్ టౌన్: మేడ్చల్ ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో నమోదైన కేసుల్లో సీజ్ చేసిన 16 వాహనాలకు మంగళవారం వేలం నిర్వహించారు. ఈ వాహనాలను 18శాతం జీఎస్టీ కలుపుకొని రూ.5.25లక్షలకు వేలం వేశామని ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపారు.



జాకారంలో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు భూమి పూజచేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ మండలాభివృద్ధికి కృషి

చౌదరిగూడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చౌదరిగూడ మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రజాపాలన విజయోత్సవ సభ పార్టీ అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు అభివద్ధి చేశాం.. ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే చెబుతున్నారని, ఏవిధంగా ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. చౌదరిగూడెం మండలాభివృద్ధికి ఏం నిధులు వెచ్చించారో తెలపాలన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసినందుకా? అభివృద్ధిని విస్మరించినందుకా ఆదర్శంగా ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లో చేసిన అభివృద్ధిని గ్రామాల్లో కార్యకర్తలు చెప్పాలన్నారు. ఐకమత్యంతో ముందుకుసాగి పార్టీకి అండగా నిలబడాలన్నారు. కార్యకర్లకు ఏ ఆపద వచ్చినా అండగా నిలబడతానన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో రూ.5.37 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. జాకారంలో ఎస్సీ కమ్యూనిటీ భవనం, అండర్‌డ్రైనేజీ, వాచ్యతండా, దాస్యతండా, గాలిగూడ నుంచి గాంగ్యాతండాకు బీటీ రోడ్డు, చౌదరిగూడలో షాదీఖానా, పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాల నిర్మాణం, ఉన్నత పాఠశాలలో అదనపు తరగతుల గది నిర్మాణం, లచ్చంపేటలో జీపీ భవనం, అండర్‌డ్రైనేజీ, లాల్‌పహాడ్ చలివేంద్రంపల్లి వరకు వేస్తున్న రీటీటీ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం చౌదరిగూడలో ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ జగదీశ్వర్, ఏఈ వంశీకృష్ణ, సీనియర్ నాయకుడు బాబర్‌ఖాన్, కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, వెంకటనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సుకు పాటుపడాలి

కడ్తాల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రభుత్వానికి మధ్య మార్కెట్ పాలకవర్గం వారధిగా పనిచేయాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ నరేశ్ నాయక్‌లకు మంగళవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మీనర్సింహారెడ్డి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, నాయకులు లాయక్‌అలీ, లక్ష్మణ్ నాయక్, జహంగీర్‌అలీ, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతాం

కొడంగల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుదామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.చంద్రయ్య అన్నారు. మంగళవారం కొడంగల్‌లో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్‌ల ప్రయోజనాల కోసం ప్రజల స్వాతంత్ర్యాన్ని కేంద్ర ప్రభుత్వం తాకట్టు పెడుతోందన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు రూ.26వేలివ్వాలని అన్నారు. భోజన కార్మికులకు వేతన విధానాన్ని అమలు చేస్తూ పెండింగ్ బిల్లులను ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలనూ పరిష్కరించాలన్నారు. ఎంపీడీవో ఉషశ్రీకి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆశాల సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు పద్మావతి, సుజాత, రేణుక, యాదమ్మ, ఈశ్వరమ్మ, పంచాయతీ కార్మికులు సుమిత్ర, సద్దాంహుస్సేన్, మొగులమ్మ, శ్రీనివాస్, వెంకటప్ప, సేవ్యానాయక్ పాల్గొన్నారు.

బస్తాల్లేక నిలిచిన కొనుగోళ్లు


కొనుగోలు కేంద్రం వద్ద కాంట నిలిచిపోవడంతో కుప్పలుగా పేరుకున్న ధాన్యం నిలువలు

బొంరాస్‌పేట్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): అధికారుల పనితీరు లోపంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులకు తప్పడం లేదు. బొంరాస్‌పేట్ ఐకేపీ కొనుగోలు కేంద్రం జిల్లాలోనే అత్యధికంగా ధాన్యం సేకరించి రికార్డు సాధించింది. అధికారుల సహకారం లేక ఇక్కడ రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మొదట్లో గన్నీ బ్యాగులు లేక 20రోజుల వరకు కొనుగోళ్లు సాగలేదు. వారం క్రితం 7వేల బస్తాలు పంపినా సరిపోవడంలేదు. గన్నీ బస్తాల్లేక మూడు రోజులుగా కొనుగోళ్లు నిలిచాయి. ఏజెన్సీ నిర్వాహకులు ఓపీయంఎస్‌లో సరైన నివేదిక చూపించకే సరిపడా బ్యాగులు రావడం లేదని సమాచారం. 7వేల బస్తాలొచ్చినా 6వేల బస్తాలకుపైగా ధాన్యాన్ని కొన్నారు. వెయ్యి బస్తాలను తూకం వేసి లోడ్‌కు ఉంచారు. సోమ, మంగళవారాల్లో వెయ్యి బస్తాలు తూకం వేసి, 700బస్తాలు లోడ్ చేశారు.

తుఫాన్ వార్తలతో ఆందోళనల్లో రైతులు

వడ్లు తడుస్తాయేమోనని భయం

బంగాళఖాతంలో ఏర్పడిన తుఫాన్‌పై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం నుంచి దక్షిణ తెలంగాణలో వర్షం పడే అవకాశం ఉందని చెప్పడంతో వడ్లు తుడస్తాయని దిగులు చెందుతున్నారు. కేంద్రం దగ్గర స్థలం లేక రాశులు పోసి ఎదురుచూస్తున్నారు.

అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం

రైతులు ఇప్పటికే ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు సమాచారమిచ్చినా గన్నీ బ్యాగులు తెప్పించలేదు. మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి ద్వారా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు ఇబ్బందులు వివరించారు. బుధవారమైనా గన్నీ బస్తాలు తెప్పించాలని రైతులు అంటున్నారు.

మూడు రోజులుగా గన్నీ బస్తాలు లేవు



బొంరాస్‌పేట్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో మూడు రోజులుగా బస్తాలు లేక కాంటా నిలిచింది. ప్రతీ సంవత్సరం ఇలాగే బస్తాలుంటే లారీలు రావు.. లారీలు వస్తే బస్తాలు ఉండవు. ఈ సంవత్సరం కొనుగోలు సజావుగా సాగుతుందనుకుంటే ఒక్కసారి మాత్రమే బస్తాలు పంపించారు. తిరిగి బస్తాల కోసం ఎదురు చూస్తున్నాం.

- కాశప్ప, రైతు, బొంరాస్‌పేట్

వర్షం వస్తే ఏం చేయాలి?



ఇప్పటికే పొలాల్లోని ధాన్యాన్ని ఆరబెట్టుకొని కేంద్రానికి తీసుకొచ్చాం. తుఫాన్ అంటున్నారు. వానొచ్చి ఎండిన వడ్లు మొత్తం తడిస్తే మాకు తీవ్ర నష్టం జరుగుతుంది. బస్తాలు లేక ఆరబెట్టిన ధాన్యం తడిసిపోతే అధికారులు కొనుగోలు చేస్తారా.

- హన్మయ్య, రైతు, బొంరాస్‌పేట్

ప్రజాపాలన విజయోత్సవాలు

బొంరాస్‌పేట్/మూడుచింతలపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండలంలో ప్రజాపాలన విజయోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. చౌదర్‌పల్లిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ ఆధ్వర్యంలో రూ.60లక్షలతో పాఠశాల అదనపు గదుల నిర్మాణం, రూ.20లక్షలతో అంగన్‌వాడీ నిర్మాణం, లక్ష వ్యయంతో 31మంది రైతులకు ఉపాధి హామీ ద్వారా పశువుల షెడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, కృష్ణ, వెంకట్రాములుగౌడ్, నర్సిములునాయుడు, మల్లికార్జున్, దేశ్యానాయక్ పాల్గొన్నారు. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీలపై 10మంది కళాకారులు కళాజాత నిర్వహించారు. క్యాటిల్ షెడ్, ల్యాండ్ డెవలప్మెంట్, రోడ్లు వేయడం, తదితర పనులకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో నీరజ, డీఆర్‌డీవో సాంబశివరావు, ఎంపీడీవో వత్సలాదేవి, గ్రామ ప్రత్యేక అధికారి మోసెస్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్నాథం, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టే యత్నం

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

మేడ్చల్ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాల, మాదిగల మధ్య చిచ్చుపెడుతున్నాయని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, ఉపాధ్యక్షుడు బేరి ఈశ్వర్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా వ్యవహరించడాన్ని వ్యతిరేకిస్తూ అక్టోబరు 25న భద్రాచలంలో మాల మహానాడు ప్రారంభించిన వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర మంగళవారం మేడ్చల్ మండలం ఎల్లంపేటకు చేరింది. ఈ సందర్భంగా సభలో సుధాకర్, ఈశ్వర్‌లు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలను విడగొట్టి తమ పబ్బం గడుపుకుంటున్నాయని ఆరోపించారు. రాజకీయ పార్టీలు దళితుల మధ్య పెడుతున్న చిచ్చు పట్ల చైతన్యపర్చేందుకే పాదయాత్రను చేపట్టామని పేర్కొన్నారు. మంద కృష్ణ మాదిగ ప్రధాని మోడీ చేతుల్లో కీలుబొమ్మలా మారారన్నారు. దళితులు ఐక్యంగా ఉంటేనే వారి హక్కులకు పరిరక్షణ ఉంటుందన్న విషయం ప్రతొక్కరు తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాలహానాడు నాయకులు ఉద్దండాపురం సత్యనారాయణ, నాగభూషణం, జె.దేవ, సంజీవయ్య, సంజీవ, వెంకటేష్, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


వికారాబాద్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కులకచర్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో అధికారులు, నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు.కులకచర్ల చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వక్తలు రాజ్యాంగం గురించి వివరించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. చౌడాపూర్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్‌చారి బహుమతులు అందజేశారు.

ఘట్‌కేసర్ రూరల్: వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వ్యాస రచన, ఉపన్యాస పోటీను నిర్వహించారు. సీఎస్‌ఈ కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంలో పౌరుల హక్కులు, విధులు పొందుపరిచారని గుర్తుచేశారు. అధ్యాపకులు మనోజ్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటర్లు తదితరులు పాల్గొన్నారు.

కీసర: పలు సంఘాల నాయకులు అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. కీసరలోని చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

పూడూరు: రాజ్యాంగ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ భరత్ అన్నారు. మండల కేంద్రంలో విద్యార్థులతో 2కే రన్ నిర్వహించారు. రాజ్యాంగ హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. 18ఏళ్లు నిండిన వారు ఓటు హక్కును కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ రూరల్: అనురాగ్ యూనివర్సిటీలో రాజ్యాంగ దినోత్సవంలో అధ్యాపకులు, విద్యార్థులు

దోమ: దోమలోని జూనియర్ కళాశాలలో ఎంపీడీవో మహేశ్‌బాబు మాట్లాడుతూ రాజ్యాంగం పట్ల ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి అధికారులు నివాళులు అర్పించారు. తహసీల్దార్ పురుషోత్తం, ఎంఈవో వెంకట్, డీటీ నర్సిములు, వైద్యురాలు రజిత, ప్రిన్సిపాల్ రూపాదేవి, అధ్యాపకులు, ఆస్పత్రి సిబ్బంది విజయలక్ష్మి, ప్రభులింగం, రెవెన్యూ సిబ్బంది, పీఎస్ పాల్గొన్నారు.

తాండూరు: బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలరాజ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రాజ్యాంగం వల్లే అణగారిన వర్గాలకు హక్కులు చేకూరాయని అన్నారు. పీడితులకు రక్షణ కల్పించింది రాజ్యాంగమేనన్నారు. బీఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతూ రాజ్యాంగం ఆత్మ లాంటిదన్నారు. నాయకుడు సత్యమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగాన్నే మ్యానిఫెస్టోగా పెట్టుకొని పనిచేస్తున్నది బీఎస్పీ మాత్రమేనన్నారు. సీనియర్ నాయకులు అంజాద్ అలీ పాషా, రమేష్ పాల్గొన్నారు.

వికారాబాద్: రాజ్యాంగం స్ఫూర్తితో దేశంలో పాలన సాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, దిశ కమిటీ సభ్యుడు వడ్ల నందు అన్నారు.మంగళవారం బీజేపీ కార్యాలయంలో రాజ్యాంగ దివస్‌ను నిర్వహించి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, ప్రధాన కార్యదర్శులు విజయభాస్కర్‌రెడ్డి, కృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, సీనియర్ నాయకులు కేపీ.రాజు, ధార్మిక సెల్ ఇన్‌చార్జి, దిశా కమిటీ మెంబర్ కొప్పుల రాజశేఖర్, న్యాయవాది మనోహర్‌రావు, ధారూరు సొసైటీ వైస్‌చైర్మన్ రాజు, శివరాజు, రాములు, ప్యాట శంకర్, మోహన్‌రెడ్డి, అమర్, యాదగిరి, రఘు, బండారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పరిగిలో తహసీల్దార్ కార్యాలయం నుంచి రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. వికారాబాద్ ఆర్డీవో ఎం.వాసుచంద్ర పాల్గొన్నారు. రాజ్యాంగం, ఓటరు ప్రాధాన్యంపై వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, డీటీ నవీన్‌రెడ్డి, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొడంగల్: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేడ్కర్ సంఘం నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. స్వేచ్ఛ, లౌకిక, ప్రజాస్వామ్య విలువలను పొందుపర్చి దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు బీఆర్.అంబేడ్కర్ అని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమేశ్‌బాబు, ఇస్సప్ప, సాయిలు, వెంకటయ్య, బషీర్, సాయిలు, శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం

తాండూరు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైందని, రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకోవాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ కోరారు.తాండూరు పట్టణం ఇందిరా చౌక్ పోలీస్‌స్టేషన్ నుంచి సెయింట్ మార్క్స్ హైస్కూల్ వరకు రాజ్యాంగ దినోత్సవం, ఓటరు అవగాహనపై 2కే రన్ నిర్వహించారు. తహసీల్దార్ తారాసింగ్, చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ విక్రమసింహారెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్ శ్రీశైలం, మెప్మా కోఆర్డినేటర్ విశాల,విద్యార్థులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: రాజ్యంగంలో ఓటు హక్కుకు ప్రాధాన్యం ఉంటుందని ఆర్‌ఐ గోవర్ధన్ అన్నారు. 2కే రన్‌ను ప్రారంభించారు. 18ఏళ్లు నిండిన వారందరూ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కులకచర్ల: చౌడాపూర్‌లో యువకులు 2కే రన్ నిర్వహించారు. 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. చౌరస్తా నుంచి మరికల్ రోడ్డులో 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ లింగయ్య, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, యువకులు పాల్గొన్నారు.


కీసర చౌరస్తాలో అంబేడ్కర్‌కు నివాళులు


కొడంగల్: మాట్లాడుతున్న నాయకులు



పరిగిలో నిర్వహించిన 2కే రన్‌లో వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర

క్రైం కార్నర్

ప్లైవుడ్ కంపెనీలో కార్మికుడి మృతి


మోహిత్‌కుమార్ మృతదేహం

పరిగి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో కార్మికుడు మృతిచెందిన ఘటన మాదారం శివారు ప్లైవుడ్ కంపెనీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మోహిత్‌కుమార్(31) అనే వ్యక్తి కంపెనీలో పనిచేస్తున్నాడు. మోహిత్ స్వగ్రామంలో ఓ కేసులో జైలు శిక్ష అనుభవించాడు. మోహిత్‌కుమార్ 20రోజుల క్రితం వచ్చి ప్లైవుడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడు మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి కంపెనీ కేటాయించిన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్న స్థితిలో చనిపోయాడు. అదే కంపెనీలో చేస్తున్న అతడి సొంత తమ్ముడు సర్వన్‌కుమార్ గదికి వెళ్లి చూడగా అప్పటికే చనిపోయాడు. మోహిత్‌కు తాడు తీసి దించగా అప్పటికే మృతిచెందాడు. సార్వన్‌కుమార్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

వేర్వేరు చోట్ల పలువురి అదృశ్యం


ఉప్పరి రాజు

పెద్దేముల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన పెద్దేముల్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఉప్పరి రాజు(29) ఈ నెల 22న హైదరాబాద్‌లోని తన సోదరి వద్దకు వెళ్లొస్తానని చెప్పి వెళ్లాడు. ఇప్పటి వరకు అతడు అతడి ఆచుకీ తెలియక తల్లి కమలమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కూతురితో సహా తల్లిదండ్రులు...


చందన, తల్లిదండ్రులు వెంకటరమణ, సుధారాణి

ఘట్‌కేసర్ రూరల్: కూతురితో సహా తల్లిదండ్రులు అదృశ్యమైన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం. అన్నోజిగూడ ప్రకాశ్‌నగర్‌లో ఉండే వెంకటరమణ(47), భార్య సుధారాణి(45), కూతురు చందన(21) ఉంటున్నారు. వెంకటరమణ ఇన్ఫోసిస్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంటాడు. కూతురు చందనను మిర్యాలగూడ వాసి ఆశల మోహన్‌కిచ్చి 2023లో పెళ్లి చేశారు. చందన అనారోగ్యం బారిన పడటంతో మోహన్ భార్యను గత నెల 14న పుట్టింటికి పంపాడు. మోహన్ భార్యతో మాట్లాడి ఆరోగ్యం గురించి తెలుసుకునేవాడు. ఈ నెల 13 వరకు మాట్లాడాడు. తర్వాత ఎవరికి ఫోన్ చేసినా స్విచాఫ్ రావడంతో అన్నోజిగూడకు వచ్చి చూడగా ఇంటికి తాళం ఉంది. దీంతో మోహన్ తన భార్య, అత్తమామల కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాలిక మిస్సింగ్ కేసు దర్యాప్తు ముమ్మరం


బాలిక స్వాతి

తాండూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బాలిక మిస్సింగ్ కేసులో దర్యప్తు ముమ్మరం చేశామని కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కరన్‌కోట్‌కు చెందిన బక్క లాలమ్మ మనవరాలు స్వాతి ఈ నెల 22న ఉప్పు ప్యాకెట్ కోసం అని షాప్‌నకు వెళ్లి తిరిగి రాలేదు. లాలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు రెండు బృందాలుగా గాలిస్తున్నారు. బాలిక తప్పిపోయిన రోజున ఉదయం 10గంటల ప్రాంతంలో స్వాతి తానే కర్ణాటక నుంచి వచ్చే బస్సు(నంబర్-కేఏ32ఎఫ్1915)లో ఎక్కి తాండూరు మల్లప్ప మడిగ వద్ద దిగినట్లు కండక్టర్ ద్వారా తెలిసిందని ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. గతంలో బాలిక బస్సులో తన చిన్నమ్మ వద్దకు వెళ్లేదని, ఇప్పుడు కూడా అలాగే పోయి ఉండొచ్చని అనుమానవం వ్యక్తం చేశారు. రెండు బృందాలుగా బాలిక ఆచూకీ కోసం వెతుకుతున్నట్లు ఎస్సై తెలిపారు. త్వరలోనే బాలిక మిస్సింగ్ కేసును ఛేదిస్తామన్నారు. బాలిక ఆచూకీ తెలిసిన 87126 70052, 8712670017 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

మద్యం షాపులో చోరీకి యత్నం

దోమ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దోమలోని వైన్స్‌లో దుండగులు సోమవారం రాత్రి చోరీకి యత్నించారు. దుకాణం ఒక తలుపు తాళం విరగ్గొట్టారు. మరో తలుపు తాళం రాకపోవడంతో దొంగలు వెళ్లిపోయారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడికి వెళ్లి పరిశీలించారు.

పత్తి రైతు పరేషాన్!

(5వ పేజీ తరువాయి)

లేక రైతులు మార్కెట్‌లో తక్కువ ధరకే పత్తిని అమ్ముకొని నష్టపోతున్నారు. ఈ కేంద్రాల వద్ద దళారులు చెప్పిన ధరకే పత్తి కొంటున్నారు.

ఎకరాకు నాలుగు నుంచి ఆరు క్వింటాళ్లు

ఈ సారి జిల్లాలో 2,51,592ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అధిక వర్షంతో ఆశించిన దానిలో సగం కూడా దిగుబడి రాలేదు. జిల్లాలో లక్షన్నర ఎకరాల్లో పత్తి పంటకు నష్టం జరిందని రైతులు చెబుతున్నారు. అధికారుల మాత్రం 50వేలలోపు ఎకరాల్లో మాత్రమే నష్టం జరిగిందని పేర్కొన్నారు. అన్ని రకాల అనుకూలిస్తే ఎకరాకు 12నుంచి 20క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఈ సారి ఎకరానికి నాలుగు నుంచి ఆరు క్వింటాళ్ల లోపే వస్తోంది. ఈ సారి 2.5లక్షల లక్షల టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు సీసీఐ 27వేల టన్నులు కొనుగోలు చేయగా, ప్రైవేట్ మార్కెట్‌లో 20వేల టన్నుల పత్తి కొన్నారు.

వ్యాపారులు సిండికేటై...

పత్తి రైతులు పత్తిని అమ్ముకోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 14కాటన్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నా కొనుగోళ్లు చేయడం లేదని రైతులంటున్నారు. ఎ-గ్రేడ్ పత్తికి రూ.7,521, బి-గ్రేడ్‌కు రూ.7,220గా సీసీఐ నిర్ణయించింది. సీసీఐ కొర్రీలతో ప్రైవేట్‌లో అమ్ముకుందామన్నా దళారులు పత్తి నాణ్యత లేదని ధరను తగ్గిస్తున్నారు. వ్యాపారులంతా సిండికేట్ మారి ప్రభుత్వ మద్దతు ధర కంటే క్వింటాలుకు వెయ్యి చొప్పున తగ్గించి కొంటున్నారు. క్వింటాలుకు రూ.6600 నుంచి రూ.7200ల వరకు ధర పెడుతున్నారు.

తూకాల్లో భారీ మోసాలు...

మార్కెట్ కమిటీ అధికారుల పర్యవేక్షణ లేక జిన్నింగ్ మిల్లుల్లో పత్తి తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. జిన్నింగ్ మిల్లుల్లో వే బ్రిడ్జిలపై తూకం వేసి అన్‌లోడ్ చేస్తారు. ఈ తూకాన్ని రైతులకు చూపించరు. గ్రామాల్లో రాళ్లబాట్లతో తూకాలు చేపడుతున్నారు. పత్తి అమ్మకాల్లో ఇంత అక్రమాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు

నాణ్యత పేరుతో రెండు క్వింటాళ్లు తగ్గింపు

36క్వింటాళ్ల పత్తిని అమ్మిన. నాణ్యత లేదని రెండు క్వింటాళ్లు తగ్గించారు. కాటన్ మిల్లుకు పోతే కొర్రీలు పెడుతున్నారు. నాణ్యత లేదని తక్కువ ధర ఇస్తున్నారు. ఏటేటా పెట్టుబడులు పెరుగుతున్న దృష్ట్యా పత్తికి క్వింటాలుకు కనీసం రూ.12వేలు చెల్లించాలి.

- రాములు, పత్తి రైతు, గుండెపల్లి, దౌల్తాబాద్ మండలం

జిల్లాలో 14 కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో 14కాటన్ మిల్లున్నాయి. అన్నింట్లో పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. రెండున్నర లక్షల టన్నుల పత్తి వస్తుందని అంచనా వేశాం. ఇప్పటి వరకు 27వేల టన్నులు కొనుగోలు చేశారు. మరోవారం రోజుల్లో పత్తి కొనుగోళ్ల ఊపందుకుంటాయి. తూకాల్లో మోసాలకు పాల్పడితే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటాం.

- సారంగపాని, జిల్లా మార్కెటింగ్ అధికారి

కానరాని కల్లాలు ..

(5వ పేజీ తరువాయి)

పనులు చేయించినా ఫలితం లేకుండా పోయింది. నిర్మించిన కల్లాలను కూడా రైతులు సద్వినియోగం చేసుకోవడం లేదు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 585 కల్లాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిచ్చినా కేవలం 227 కల్లాల నిర్మాణం పూర్తయ్యాయి. ఇందులో కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. కల్లాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి నిధులు వెచ్చించారు. తమ అనుమతి లేకుండా నిధులు ఎలా మళ్లిస్తారని కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం చెప్పడంతో కల్లాల నిర్మాణాలు నిలిచిపోయాయి.

జోరుగా వరి కోతలు

ప్రస్తుతం వరి కోతలు ముగింపుకొచ్చాయి. జిల్లాలో 17,855 ఎకరాల్లో వరి సాగు చేశారు. పొలాల్లో బురద ఉండటంతో రోడ్లపై ఆరబోస్తున్నారు. ఇక్కడ త్వరగా ఎండుతుండటంతో రైతులు రోడ్లపై ఎండబోస్తున్నారు. అకాల వర్షం వచ్చినా ఇబ్బంది లేకపోవడం, త్వరగా కుప్పనూర్చే పరిస్థితి ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం


బషీరాబాద్: మంతట్టి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్/తాండూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం పనుల జాతరలో పాల్గొని రూ.30లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మట్లాడుతూ పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు ధనిక రాష్ట్రాన్ని అప్పుల్లోకి తీసుకెళ్లి ముంచారన్నారు. పేదలకు డబుల్‌బెడ్ రూంలు ఇస్తామని వాళ్లు మాత్రం ఫాంహౌజ్‌లు కట్టుకున్నారని ఆరోపించారు. పేదలకు విద్య, వైద్యం అందించాలని నియోజకవర్గంలో రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని అన్నారు. బషీరాబాద్ ఆసుపత్రిని 30 పడకలకు పెంచుతామని బీఆర్ఎస్ నాయకులు పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చామన్నారు. రూ.30కోట్లతో బషీరాబాద్ నుంచి జీవన్గి మీదుగా కరణ్‌కోట్ వరకు బీ టీ రోడ్డు, జీవన్గి-మంతట్టి మధ్య లింక్ రోడ్డుకు రూ.4కోట్లు మంజూరైనందున పనులు చేపడుతామని వెల్లడించారు. అనంతరం మహిళా సంఘాలు ఏర్పాటు చేసకున్న దుకాణాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులకు రూ.1.20కోట్ల రుణాల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్, మాజీ జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్లు అజయ్‌ప్రసాద్, చందర్‌నాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు కలాల్ నర్సింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, రామునాయక్, మహేందర్‌రెడ్డి, సురేశ్, ప్రత్యేకాధికారి మోహన్‌బాబు, తహసీల్దార్ వై.వెంకటేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు. తాండూరు మండలం గోనూరులో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేశారని చెప్పారు. గోనూరులో ఫార్మేషన్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఎస్‌ఐ రవీందర్‌గౌడ్, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, కమిటీ డైరెక్టర్లు ఉదయభాస్కర్‌రెడ్డి, జర్నప్ప, కాంగ్రెస్ నాయకులు ఉత్తంచంద్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, రాందాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప, నాయకులు నర్సిరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గోవింద్, ఎంపీడీవో విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

ఏడాదిలో ఎన్నో విజయాలు సాధించాం


రంగంపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పాల్గొన్న నాయకులు, అధికారులు

పరిగి,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో ఎన్నో విజయాలు సాధించామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రంగంపల్లి, రూప్‌ఖాన్‌పేట్ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఉపాధి పథకం కింద 19పశువుల పాకల నిర్మాణాలను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఏకకాలంలో 2లక్షల రుణ మాఫీ అనేది దేశంలోనే రికార్డన్నారు. వచ్చే నెలలో రైతు భరోసా, పింఛన్‌ల పెంపు అమలు చేయబోతున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, మురికికాలువల నిర్మాణం. వీధిలైట్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశరాంరెడ్డి, పీఆర్ ఈఈ ఉమేశ్, ఎంపీడీవో కరీం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పార్థసారథి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, ప్రధానకార్యదర్శి కె.హన్మంత్, మాజీ వైఎస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, ఎన్.రామకృష్ణ, కె.సురేష్‌చందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

కీసర: కీసరలోని వరాల అయ్యప్ప స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఉత్సవ మూర్తిని ఆలయ ఆవరణలో ఊరేగించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా అర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బెలిదె రమేష్ గుప్తా అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

ఎంఈవోకు సన్మానం

పరిగి: పరిగి, దోమ, పూడూరు మండలాల ఎంఈవోగా పనిచేసి మేడ్చల్ జిల్లాకు బదిలీఅయిన హరిశ్చందర్‌కు పరిగిలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంఈవో దంపతులను పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బి.పరశరాంరెడ్డి, మాజీ ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, కాంగ్రెస్ నాయకులు పార్థసారథి, కె.హన్మంత్, కె.సత్యనారాయణ, ఇ.కృష్ణ, టీచర్ల సంఘాల నాయకులు వెంకట్, శ్రీశైలం, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే మా దృష్టికి తెండి

ధారూరు: ధాన్యం కొనుగోళ్లలో సమస్యలెదురైతే తమ దృష్టికి తేవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ కేంద్రాల నిర్వాహకులకు, రైతులకు సూచించారు. నాగారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తూకం విధానం, వడ్లలో తేమ శాతాన్ని చెక్ చేశారు. వడ్లు నింపేందుకు గోనె సంచుల కొరత ఉందని రైతులు చెప్పారు. అదనపు కలెక్టర్ వెంట ప్యాక్స్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి, డీఎస్వో మోహన్‌బాబు, ఆర్డీవో వాసుచంద్ర, తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్ పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా కేంద్రం ఇన్‌చార్జి పుష్పలత, హరిత, రైతులు ఉన్నారు.

ఏవోను కలిసిన రైతు సంఘం నాయకులు

ధారూరు: నూతన ఏవో సూర్యప్రకాష్‌ను ధారూరు రైతు వేదికలో సంఘం నాయకులు కలిశారు. ఏవోకు శాలువ కప్పి సన్మానించారు. ధాన్యం, పత్తి ఉత్పత్తుల విక్రయాల్లో అన్‌లైన్‌లో పట్టాదారు పేరు ఉండటంతో కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంట విక్రయ డబ్బులు కౌలు రైతుల ఖాతాల్లో జమయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రవీణ్‌గౌడ్, సతీష్ పటేల్, పవన్ కుమార్, శివరాజ్, మల్లేశం, రాఘువేందర్, ఏఈవోలు సంతోష్, హరిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

అటవీ భూమిలో అక్రమంగా బోరు

కులకచర్ల: అటవీ భూమిలో బోరు వేయడంతో అటవీ శాఖ అధికారి ఇద్దరికి రూ.25వేల జరిమానా విధించారు. అనంతసాగర్‌కు చెందిన చిల్ల రామకృష్ణ, సున్నల దస్తయ్య అటవీ భూమిలో సోమవారం రాత్రి బోరు వేశారు. విషయం తెలిసిన సెక్షన్ అధికారి సాయికుమార్ ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున జరిమానా విధించారు.

ఓటరు లిస్టులో తప్పులు సరిచేసుకోవాలి

యాలాల: ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలని ఎంపీడీవో పుష్పలీల అన్నారు. పంచాయతీల ఓటరు జాబితా సవరణపై వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. జాబితాలో మార్పులు, చేర్పులుంటే సరిచేసుకునేందుకు అవకాశం ఉందని ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లాని నాయకులను కోరారు. సమావేశంలో నాయకులు అక్బర్‌బాబా, ఎర్ర హన్మంతు తదితరులున్నారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ధర్నా

పరిగి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజావ్యరేక విధానాలను నిరసిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పరిగి బస్టాండ్ వద్ద రాస్తారోకోను నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలను అవలంభిస్తుందన్నారు. కార్మికులకు వేతనం రూ.26వేలు, పింఛన్ రూ.10వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హబీబ్, సత్తయ్య, మహిపాల్‌రెడ్డి, రఘురాం, శేఖర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కొడంగల్: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీడీవో ఉషశ్రీ అన్నారు. పెద్దనందిగామ జడ్పీహెచ్ఎస్‌లో ఆమె భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్: మంతట్టి జడ్పీ, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రత్యేకాధికారి మోహన్‌బాబు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో భోజనం ఎలా ఉంది? ముద్దగా వండి పెడుతున్నారనేదానిపై ఆరా తీశారు. అంతకు ముందు తహసీల్దార్ వై.వెంకటేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంఈవో సుధాకర్‌రెడ్డి పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన బియ్యంను పరిశీలన చేశారు.

కులకచర్ల: బండవెల్కిచర్ల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి పీడీ, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీఎం శోభ భోజనం చేశారు. ఉపాధిహామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేద్దాం

వికారాబాద్: 29న వికారాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. 29న అమర వీరుల స్థూపానికి నివాళులు అర్పిస్తామన్నారు.